# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 149 | విశాఖపట్నం | 1-3-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణారావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 149 | VISAKHAPATNAM | 1-3-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




## బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు

# 21 మంది మృతి





- తీవ్రంగా గాయపడిన 17 మంది
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు.. ఘటనా స్థలానికి వెళ్లాలని హోంమంత్రి అనితకు ఆదేశం
- సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

**సామర్లకోట, పతాకం న్యూస్:** కాకినాడ జిల్లా బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడుకు 21 మంది ఆహుతయ్యారు. సామర్లకోట మండలం వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. భారీ ఎత్తున మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. వేట్లపాలెం, జి.మేడపాడు మధ్య పంట పొలాల్లో బాణసంచా తయారు చేస్తున్నారు. అడపా నాని అనే వ్యక్తి పొలాల్లో చదును చేసి బాణసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. వరిపొలాల మధ్య ఎవరూ రాలేని ప్రాంతంలో ఈ బాణసంచా కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇక్కడ రోజూ 25 నుంచి 30 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో ఎక్కువగా మహిళలే ఉన్నారు. శనివారం అధిక సంఖ్యలో మహిళలు బాణసంచా తయారీలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ మధ్యాహ్నం తర్వాత బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం సంభవించింది. దాదాపు గంటకుపైగా పేలుళ్లు కొనసాగినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుళ్లు సంభవించినప్పుడు భూకంపం వచ్చినంతగా శబ్ధం విన్నట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుళ్ల కారణంగా చుట్టుపక్కల గ్రామాలు భయాందోళనకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగ అలుముకుంది. స్థానికులు పేలుడు సంభవించిన ప్రాంతానికి చేరుకునే సరికి చాలామంది అగ్నికి ఆహుతయ్యారు. శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి. పేలుళ్ల ఘటనలో 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆజిల్లా కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్‌లో ఆరుగురు వ్యక్తులు చికిత్స పొందుతున్నారు.

### బాణాసంచా పేలుడు ప్రమాదంపై

## చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

**విజయనగరం, పతాకం న్యూస్:** కాకినాడ జిల్లా వేట్లపాలెంలోని బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై విచారం వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడిన సీఎం బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నానని బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చంద్రబాబు ట్వీట్ చేశారు. తక్షణం సహాయ చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం ఆదేశించారు. ఘటనాస్థలానికి వెళ్లాలని హోంమంత్రి అనితకు ఆదేశించారు. సీఎం సూచనలో హుటాహుటిన ఘటనాస్థలానికి హోంమంత్రి వంగలపూడి అనిత బయలుదేరారు. ప్రస్తుతం విజయనగరం జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు ఉన్నారు. ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడంవిచారకరమన్నారు. పేలుడు ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు చంద్రబాబు తెలిపారు. బాధితులకుఅవసరమైన తక్షణ సాయం అందించాలని, అధికారులు సహాయ చర్యలు పర్యవేక్షిస్తున్నారని అన్నారు.



## బాణాసంచా పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి



**తాడేపల్లి, పతాకం న్యూస్:** కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న భారీ పేలుడు ఘటనపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన విచారాన్ని తెలియజేశారు. ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటువంటి విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అలాగే, ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం ప్రకటించాలని జగన్ డిమాండ్ చేశారు. పేలుడు ధాటికి గాయపడిన వారికి వెంటనే మెరుగైన వైద్య సహాయం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

### కాకినాడ జిల్లా బాణాసంచా పేలుళ్ల కారణాలపై

## విచారణ చేస్తున్నాం: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** కాకినాడ జిల్లాలో ఓ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడులో 18 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన సమయంలో 30 మంది కార్మికులు బాణసంచా కేంద్రంలో ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన ఆయన విడుదల చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా కల్పించారు. ఈ దురదృష్టకర ఘటన గురించి తెలియగానే కాకినాడ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నానని అన్నారు. కాకినాడ కలెక్టర్, ఎస్పీ ఘటన స్థలంలో ఉండి పరిస్థితిని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని చెప్పుకొచ్చారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించే ఏర్పాట్లు చేశారని తెలిపారు.



దేశ వ్యాప్తంగా హెచ్‌పీవీ టీకాను ప్రారంభించిన మోడీ

4లో



2లో

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి..

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## పరాకాష్ట

అసాధారణమైన రీతిలో 'వారు తుపాకీ కాల్చారు... ఆ తూటాతో న్యాయ వ్యవస్థ నెత్తురోడుతోంది...' అన్న భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర స్థాయిలో కలకలం రేపాయి. జాతీయ, విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) ప్రచురించిన ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలో 'కరప్షన్ ఇన్ ది జ్యుడిషియరీ' అనే పాఠ్యాంశం తీవ్ర వివాదమైంది. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా విచారణకు తీసుకోవడమే గాక.. ఆ సందర్భంగా ఆగ్రహంతో స్పందించిన తీరు, సిజెఐ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కుదిపేశాయి. 'న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా, ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్రగా ఇది కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది.' అని విచారణ సందర్భంగా సిజెఐ అన్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. 'జవాబుదారీతనం ఏర్పడేంతవరకు ఈ వ్యవహారాన్ని మేం వదలిబెట్టం. దీని వెనుక ఎవరున్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం.' అని సిజెఐ అనడం బాగానేవుంది కానీ ఎంతవరకు అది జరుగుతుందో చూడాలి. కన్నంలో దొంగలా దొరికిపోయిన కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఆ చాప్టర్లను ఇద్దరు వ్యక్తులు రూపొందించారని, వారు యుజిసి లేదా మరే మంత్రిత్వ శాఖతోనూ కలిసి పనిచేయడం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణనివ్వడం తప్పించుకునే ప్రయత్నమే! ఆ పాఠ్యాంశాన్ని ముద్రించిన ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా నిషేధించాలని, ఇప్పటికే ప్రచురితమైన పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించడం సరైనది. ఇంత తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన సుప్రీం 'న్యాయ వ్యవస్థను కూలంకషంగా పరిశీలించే హక్కును వినియోగించుకోవడం లేదా చట్టబద్ధమైన విమర్శలు చేసే హక్కును మేం ఈ సుమోటో ప్రొసీడింగ్స్ సందర్భంగా అణచివేయాలనుకోవడం లేదు.' అని చెప్పడం సముచితంగా వుంది. అయితే 8వ తరగతి పాఠ్యాంశం వంటిది హఠాత్పరిణామం కాదు. గత దశాబ్ద కాలంగా ఎన్‌సిఇఆర్‌టి, ఇతర కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల చర్యలు తరచు వివాదాస్పదంగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే! పాఠ్యాంశాల్లో కొన్ని తొలగింపులు, అర్థరహితమైన చేర్పులతో మీడియాలో పతాక శీర్షికలైన సందర్భాలూ ఉన్నాయి. వాటిలో సాంఘిక శాస్త్రానికి చెందిన పాఠ్యాంశాల్లో ఎన్‌సిఇఆర్‌టి చేస్తున్నవే వివాదాలకు కారణంగా మారుతుండటం గమనార్హం. ఉదాహరణకు 7వ తరగతి పాఠ్య పుస్తకాల నుంచి గ్రీన్‌హౌస్ ప్రభావం, వాతావరణ మార్పులు, వాతావరణ వ్యవస్థలకు సంబంధించిన సూచనలు తొలగించడం, అలాగే, 8వ తరగతి పుస్తకాల నుంచి టిప్పు సుల్తాన్, నూర్జహాన్, రజియా సుల్తాన్, ఆంగ్లో -- మైసూర్ యుద్ధం వంటి చారిత్రాత్మక అంశాలకు సంబంధించిన పాఠాలు తొలగించడం వంటి అనేక దృష్టాంతాలున్నాయి. వాటన్నిటి సారాంశం భారత దేశ చరిత్రను వక్రీకరించడమే! అందునా మొగలాయీ పాలనను కించపరచడం లేదా మరుగుపరచడమే లక్ష్యంగా ఉంటున్నాయి. మరోవైపు సనాతన, ఛాందస భావాలను పెంపొందించడం, శాస్త్రీయ భావనలను చులకన చేయడమూ జరుగుతోంది. ఆయా సందర్భాల్లో గొప్ప చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలూ వాటిని ఎత్తిజూపి ప్రజలు, ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారు. అయినా అధికార పీఠాన్నధిష్టించిన పరివార్ శక్తులు చట్ట సభల్లోనూ బయటా బుకాయింపులకు పాల్పడుతున్నారేతప్ప తమ తప్పు అంగీకరించింది లేదు. కొన్నిసార్లు వీధుల్లో వీరంగం కూడా వేస్తున్నారు. అయితే, ఇప్పుడు నేరుగా న్యాయ వ్యవస్థనే టార్గెట్ చేయడం, సుప్రీం ధర్మాగ్రహం తో సర్కారు వారు ఆత్మరక్షణలో పడ్డారు. నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టవలసి వచ్చింది. పరివార్ శక్తులు సాగిస్తున్న వక్రీకరణల పర్వం గురించి దేశవ్యాప్తంగా తీవ్రమైన చర్చ జరగడం స్వాగతించదగినది. అయితే పరాకాష్టకు చేరిన ఈ వక్రీకరణను ప్రజలు అర్థం చేసుకోవడంతోపాటు ఇకపై ఇటువంటి ప్రయత్నాలు చేయకుండా అప్రమత్తమై అడ్డుకోవాలి. అందుకు చైతన్యవంతంగా నిలవాలి.

# ఏపీ నూతన సీఎస్‌గా సాయిప్రసాద్



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా జి.సాయిప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సిఎస్ విజయానంద్ శనివారం పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆయన నుంచి సాయి ప్రసాద్ సచివాలయంలో స్వీకరించారు. గత నవంబర్‌లోనే విజయానంద్ పదవీ కాలాన్ని మూడు నెలలపాటు పొడిగిస్తూ ఫిబ్రవరి 28 నురచి సాయిప్రసాద్ కొత్త సిఎస్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిరదే. ప్రస్తుతం జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ముఖ్యమంత్రికి ఎక్స్ అఫీషియో స్పెషల్ సిఎస్‌గా సాయిప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉయదం 11.33 గంటలకు సాయిప్రసాద్ నూతన సిఎస్‌గా పదవీ బాధ్యతలు చేపడతారు. 1991 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన సాయిప్రసాద్ ఎంటెక్ పట్టభద్రులుకాగా 1991 సెప్టెంబరు 15న సివిల్ సర్వీసెస్‌కు ఎరపికై 1992 జూన్ నుండి 1993 మే వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరంగల్ అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేశారు. అనంతరం 1993 సెప్టెంబరు నుండి 1995 ఏప్రిల్ వరకు పాడేరు అసిస్టెంట్ కలెక్టర్‌గా, 1995 ఆగస్టు నుండి 1997 మార్చి వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌గా పనిచేశారు. అనంతరం 1997 మే నుండి 1998 ఆగస్టు వరకు కడప జాయింట్ కలక్టర్‌గా, 2000 జూలై నుండి 2003 జూన్ వరకూ కర్నూల్ కలెక్టర్‌గా, 2003 జూన్ నుండి 2003 అక్టోబరు వరకు చిత్తూరు జిల్లా కలక్టర్‌గా పనిచేశారు. 2003 అక్టోబరు నుండి 2004 ఆగస్టు వరకు ఎపి ట్రాన్సుకో జెఎండిగా, 2004 ఆగస్టు నుండి 2006 మే వరకు ఇపిడిపిసిఎల్ సిఎండిగా, 2006 మే నుండి 2010 ఫిబ్రవరి వరకు ఎపి సిపిడిసిఎల్ సిఎండిగా విధులు నిర్వహిరచిన ఆయన 2010 ఫిబ్రవరి నుండి 2011 అక్టోబరు వరకు ఎపి హౌసింగ్ బోర్డు వైస్‌చైర్మన్‌గా పని చేశారు.అనం తరం 2011 అక్టోబరు నుండి 2014 జూన్ వరకు కేంద్ర ప్రభుత్వ ఇంధనశాఖ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. తదుపరి 2014 జూన్ నుండి 2016 ఫిబ్రవరి వరకు ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. 2020 జనవరి నుండి 2022 ఫిబ్రవరి వరకు ఎపి సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రవేట్ లిమిటెడ్‌కు సిఎండిగా, ఇంధనశాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీగాను పని చేశారు. అనంతరం 2022 ఫిబ్రవరి నుండి 2024 జూన్ వరకు భూపరిపాలన ముఖ్య కమిషనర్‌గా పనిచేశారు.

# రైతులను నాశనం చేస్తున్న భారత్, అమెరికా ఒప్పందం: రాహుల్ గాంధీ



**పంజాబ్:** భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశ రైతులను నాశనం చేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఏటా భారత్ రూ. 9 లక్షల కోట్ల విలువైన అమెరికా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని గాంధీ అన్నారు. ఈ మేరకు పంజాబ్‌లో బర్నాలాలో జరిగిన మజ్దూర్ కిసాన్ మహా ర్యాలీలో పాల్గొన్న రాహుల్, పలు వ్యాఖ్యలు చేశారు. వ్యవసాయ రంగంపై భిన్నాభిప్రాయాల కారణంగా ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయిందని ఆరోపించారు రాహుల్ గాంధీ. "పెద్ద ప్రశ్న తలెత్తుతుంది, ప్రధానమంత్రి నాలుగు నెలలుగా చేయని పని, ఆయన 15 నిమిషాల్లో ఎందుకు చేశారు?" అని ఆయన అన్నారు. వాణిజ్య ఒప్పందం అకస్మాత్తుగా ఎలా కుదిరిందని పశ్నించారు. ప్రతి సంవత్సరం భారత్ రూ. 9 లక్షల కోట్ల విలువైన యూఎస్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని మోదీ ట్రంప్‌నకు హామీ ఇచ్చారని ఆరోపించారు. మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ నరవణే పుస్తకంపై మాట్లాడాలని అనుకున్నానని, కానీ ఇటీవల లోక్‌సభలో మాట్లాడటానికి తనకు అనుమతి ఇవ్వలేదని రాహుల్ గాంధీ తెలిపారు. సరిహద్దు సమీపంలో చైనా దళాల కదలికల సమయంలో రాజకీయ నాయకత్వం నుంచి స్పందన లేకపోవడాన్ని ఆ పుస్తకం వివరించిందని ఆయన పేర్కొన్నారు. అయితే ఇప్పటికే పలుమార్లు రాహుల్ గాంధీ, భారత్– అమెరికా ఒప్పందంపై మాట్లాడారు. ఇటీవల అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో కేంద్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దీర్ఘకాలంలో భారత వ్యవసాయ రంగంపై పట్టు సాధించడానికి మరొక దేశాన్ని అనుమతిస్తున్నారా అని ప్రశ్నించారు. డ్రైడ్ డిస్టిలరీస్ గ్రెయిన్స్‌ను దిగుమతి చేసుకోవడం అంటే జన్యుమార్పిడి చేసిన అమెరికా మొక్కజొన్నను పాడి ఉత్పత్తిదారులకు అందించడమేనని రాహుల్ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఇది దేశ పాల ఉత్పత్తులను అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా అని ప్రశ్నించారు. సోయా నూనె దిగుమతికి అనుమతిస్తే, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా దేశవ్యాప్తంగా ఉన్న సోయా రైతులపై ప్రభావం ఉండదా అని నిలదీశారు. అదనపు ఉత్పత్తులు అంటే పప్పుధాన్యాలు సహా ఇతర పంటలను దిగుమతులకు భారత మార్కెట్‌ను తెరవాలనే ఒత్తిడిని సూచిస్తోందని రాహుల్ తెలిపారు. వాణిజ్యయేతర అడ్డంకులను తొలగిస్తామంటే భవిష్యత్తులో జన్యుమార్పిడి పంటలపై భారత్ తన వైఖరిని మార్చుకుంటుందా అని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రభుత్వం రైతులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆరోపించారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు. ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్? గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ? ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్ గాంధీ విమర్శించారు.

# ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి..



**ఇరాన్:** మధ్యప్రాచ్యంలో ఒక్కసారిగా ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సైనిక చర్య ప్రారంభమైన నేపథ్యంలో ఆ ప్రాంతంలోని ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఇరాన్ దేశాల్లో నివసిస్తున్న భారతీయ పౌరుల భద్రత కోసం భారత రాయబార కార్యాలయాలు అత్యవసర హెచ్చరికలు జారీ చేశాయి. అందరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించాయి. ఖతార్‌లోని దోహాలో ఉన్న భారత రాయబార కార్యాలయం ఒక కీలకమైన అడ్వైజరీని విడుదల చేసింది. "ప్రస్తుత ప్రాంతీయ పరిస్థితి దృష్ట్యా, ఖతార్‌లోని భారత పౌరులందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎంబసీ, స్థానిక అధికారులు జారీ చేసే వార్తలు, సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి" అని పేర్కొంది. ప్రజల భద్రత దృష్ట్యా సైనిక స్థావరాలకు దూరంగా ఉండాలని, ఇళ్లు లేదా ఇతర భవనాల్లోనే సురక్షితంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని స్థానిక అధికారులు జారీ చేసిన హెచ్చరికలను పాటించాలని కోరింది. ఇదే తరహాలో యూఏఈలోని భారత రాయబార కార్యాలయం కూడా అక్కడి భారతీయులకు కీలక సూచనలు చేసింది. అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని, స్థానిక అధికారులు, ఎంబసీ జారీ చేసే భద్రతా మార్గదర్శకాలను తప్పక పాటించాలని స్పష్టం చేసింది. అబుదాబి, దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించేందుకు టోల్–ఫ్రీ, వాట్సాప్ నంబర్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. ఇక, ఉద్రిక్తతలకు కేంద్రంగా ఉన్న ఇరాన్‌లోని టెహ్రాన్‌లో భారత ఎంబసీ కూడా తమ పౌరులకు హెచ్చరికలు జారీ చేసింది. భారతీయులందరూ అత్యంత జాగరూకతతో ఉండాలని, అనవసరంగా బయట తిరగవద్దని, వీలైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలని సూచించింది. స్థానిక పరిస్థితులను నిరంతరం గమనిస్తూ, తదుపరి మార్గదర్శకాల కోసం వేచి చూడాలని కోరుతూ ఎమర్జెన్సీ కాంటాక్ట్ వివరాలను అందించింది. ఈ హెచ్చరికలన్నింటికీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన నేపథ్యంగా నిలిచింది. ఇరాన్‌పై అమెరికా సైనిక దళాలు భారీ స్థాయిలో నిరంతర దాడి చేస్తున్నాయని శనివారం ఉదయం ఆయన ప్రకటించారు. "మేము వారి క్షిపణులను నాశనం చేస్తాం. వారి క్షిపణి పరిశ్రమను నేలమట్టం చేస్తాం" అని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ట్రంప్ స్పష్టం చేశారు. ఈ పరిణామంతోనే మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం నెలకొంది.

# 21 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)










అంబులెన్స్ వెళ్లే మార్గం కూడా లేదు. వరిపొలాలు బురదమయంగా ఉండటం వల్ల వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఫలితంగా చాలా సేపటి వరకు పేలుళ్లు కొనసాగాయి. ఘటనా స్థలం వద్ద పరిస్థితి బీతావహంగా ఉంది. మంటల్లో కాలిపోయి తీవ్రంగా గాయపడ్డ బాధితులను అతికష్టం మీద స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పేలుడుతో జిల్లా కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్‌లో ఆరుగురు వ్యక్తులు చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో వేట్లపాలెం వాసి కప్పా వెంకటలక్ష్మి, పెద్దాపురం వాసి మోర్తా శ్రీను, సామర్లకోటకు చెందిన కె.శ్రీను, చిటికెల లక్ష్మి ఉన్నారు. మృతుల్లో ఇప్పటివరకు పోలీసులు 11 మందిని గుర్తించారు. మృతులు అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నాని ఉన్నారు

# గిరిజన ప్రాంతంలో డోలీ గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లు



**చింతపల్లి, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతంలో డోలీ గ్రామాలకు కనెక్టివిటీ రహదారులు నిర్మిస్తున్నామని పాడేరు పంచాయతీరాజ్ డీఈఈ కె.జ్యోతిబాబు తెలిపారు. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో ఆయన పర్యటించారు. నూతనంగా నిర్మించిన దామనాపల్లి తారు రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గం పరిధిలో కనీస రహదారి సదుపాయంలేని 80 గ్రామాలను కలుపుతూ రూ.65 కోట్ల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 61 డబ్ల్యూబీఎన్ కనెక్టివిటీ రోడ్లు నిర్మించామన్నారు. ఈ రహదారులు అందుబాటులోకి రావడం వల్ల చాలా గ్రామాలకు డోలీమోతలు తప్పాయన్నారు. అలాగే పాడేరులో డల్లాపల్లికి 7.5 కిలోమీటర్లు రూ.4.2 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో తారు రోడ్డు నిర్మించామన్నారు. చింతపల్లిలోని ఎ.శనివారంలో ఐదు కిలోమీటర్లు రూ.2.5 కోట్లుతో, జీకేవీధిలోని లింగవరం-లంకవీధిలో ఐదు కిలోమీటర్లు రూ.2.5 కోట్లు, జి.మాడుగులలో 29 కిలోమీటర్లు యాభై గ్రామాలను కలుపుతూ రూ.40కోట్లతో తారు రోడ్లు నిర్మించామని చెప్పారు. అలాగే పీఎం జన్‌మన్ నిధులతో నియోజకవర్గంలో తొమ్మిది అంగన్‌వాడీ భవనాలు నిర్మిస్తున్నామన్నారు. చింతపల్లిలో ఐదు భవనాలు పూర్తి చేశామన్నారు. ఒక్కొక్క భవనానికి రూ.12 లక్షల నిధులు కేటాయించామని తెలిపారు. పాడేరులో రూ.రెండు కోట్ల నిధులతో జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయం నిర్మిస్తున్నామన్నారు. 2026-27 వార్షిక సంవత్సరంలోనూ ప్రతి గ్రామానికి కనెక్టివిటీ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈఈ బాలకిశోర్ పాల్గొన్నారు.

## రైతు గుర్తింపు నమోదుకు తుది గడువు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** విశిష్ట రైతు గుర్తింపు నమోదుకు ఒక్క రోజు మాత్రమే గడువు ఉంది. శనివారం సాయంత్రంలోగా రైతులు రిజిస్ట్రేషన్ పూర్తిచేయించుకోవాలని, లేకపోతే వ్యవసాయ సంబంధిత సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలు, రాయితీలు అందవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎం.ఆశాదేవి అంటున్నారు. లేకపోతే పీఎం కిసాన్ యోజన, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తున్న అన్నదాత సుఖీభవ పథకం, పంటనష్ట పరిహారం, రైతు బీమా పథకం, బ్యాంకుల నుంచి సున్నా వడ్డీకి పంట రుణాలు వంటివి అందవు. ఒక రైతుకు రాష్ట్రంలో ఎక్కడెక్కడ భూములు ఉన్నాసరే 11 అంకెలతో ఉన్న రైతు గుర్తింపు నంబరు ఆధారంగా భూముల వివరాలను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. వివిధ ప్రాంతాల్లో ఉన్న భూ ఖాతా వివరాలన్నీ ఇందులో పొందుపరుస్తారు. భవిష్యత్తులో యూనిక్ ఐడీ అనేది రైతులకు చాలా ప్రయోజనాలు చేకూర్చుంది. రైతు సంక్షేమ పథకాలన్నీ పారదర్శకంగా అమలు చేయడానికి ఉపయోగ పడుతుంది.

## విశాఖ జిల్లాలో 21వేల ఇళ్లు రద్దు!



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జిల్లాలో నిర్మాణం ప్రారంభం కాని సుమారు 21 వేల ఇళ్లను కేంద్రం గృహ నిర్మాణ శాఖ రద్దు చేసింది. నాలుగేళ్ల క్రితం ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద జిల్లాలో గూడు లేని పేదలకు సుమారు 1.4 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలాలు కలిగిన వారిని, గూడు లేని నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. పేదల కోసం నగర శివారుల్లో ప్రభుత్వం అభివృద్ధి చేసిన లేఅవుట్‌లలో లబ్ధిదారుల తరపున కాంట్రాక్టర్లు నిర్మాణాలు ప్రారంభించారు. ఈ ఇళ్లన్నీ 2025 డిసెంబరు నెలాఖరు (తాజాగా గడువును ఈ ఏడాది సెప్టెంబరు వరకు పొడిగించారు)లోగా పూర్తిచేయాల్సి ఉంది. ఆ విషయాన్ని కేంద్రం పలుమార్లు స్పష్టం చేస్తూ వస్తోంది. అయితే కాంట్రాక్టర్లు నిర్మాణ బాధ్యతలు చేపట్టిన 80 వేల ఇళ్లలో వివిధ కారణాలతో నాలుగో వంతు పనులు ప్రారంభించలేదు. పునాదుల్లో, మరికొన్ని పునాదులు నిర్మించి లోపల మట్టి పూడ్చని దశలో ఉన్నాయి. ఈ మూడు కేటగిరీలు కలిపి సుమారు 20 వేల వరకూ ఉంటాయని అంచనా. అదేవిధంగా సొంత స్థలాలు, ప్రభుత్వం అభివృద్ధి చేసిన లేఅవుట్‌లలో మరో 1,000 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో మొత్తం 21 వేల ఇళ్లు గడువులోగా అంటే గత ఏడాది డిసెంబరు 31వ తేదీలోగా ప్రారంభించకపోవడంతో కేంద్రం రద్దు చేసింది. అయితే సెంటు భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు జియో ట్యాగ్ చేయకపోవడంతో ఎక్కువ ఇళ్లు రద్దయినట్టు చెబుతున్నారు. కేంద్ర గృహ నిర్మాణ శాఖ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం ప్రారంభానికి ముందు లబ్ధిదారులను స్థలం వద్దకు తీసుకువెళ్లి జియో ట్యాగ్ చేయాలి. ఆ తరువాత పునాదులు (పునాదులు నిర్మించి దాంట్లో పూర్తిగా మట్టి నింపాలి) పూర్తిచేసిన తరువాత మరోసారి జియోట్యాగ్ చేస్తారు. అప్పుడు మాత్రమే మొదటి బిల్లు మంజూరుకు అవకాశం ఉంటుంది. కానీ పలు లేఅవుట్‌లలో పాక్షికంగా పునాదులు, కొన్నిచోట్ల పూర్తిస్థాయి పునాదులు నిర్మించినా జియో ట్యాగ్ చేయకపోవడంతో కేంద్రం వాటిని రద్దు జాబితాలో చేర్చిందని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తప్పుబడుతున్నారు. ఇదిలావుండగా జిల్లాలో 21 వేల ఇళ్లు రద్దు కావడంతో హౌసింగ్ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ నుంచి పూర్తిస్థాయి నివేదిక తెప్పించుకున్నారు. తాజాగా ఇళ్ల నిర్మాణాల పూర్తికి ఈ ఏడాది సెప్టెంబరు వరకూ గడువు పెంచిన నేపథ్యంలో పలు సాంకేతిక కారణాలతో రద్దు చేసిన 21 వేల ఇళ్లను పునరుద్ధరించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని యోచిస్తున్నారు.

## చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** చట్ట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మండలంలోని సూరంపాలెం గ్రామంలో సీఐ గౌరీశంకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ శివకుమార్ పోలీస్ సిబ్బంది శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని వీదులు, ప్రధాన కూడళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రికార్డులు సక్రమంగా లేని 7 ద్విచక్ర వాహనాలను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్ఐ శివకుమార్ మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడైనా గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన విక్రయానికి సంహరించిన నేరమని అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా క్రియా విక్రయాల వల్ల కలిగే అనర్థాలు గూర్చి గ్రామస్తులకు వివరించారు.చదువుకున్న యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకుండా ఉద్యోగ అవకాశాలు అంది పుచ్చుకోవాలని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు తిరిగినా,గంజాయి లేదా సారా విక్రయాల సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇచ్చినవారి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని తిలకించిన డీఎంహెచ్‌వో జగదీశ్వర రావు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాజస్థాన్ ముఖ్యమంత్రి అధ్యక్షతన భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ అజ్మీర్ గ్రామంలో గర్భాశయ క్యాన్సర్ నిరోధక హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా జూమ్ ద్వారా విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి జగదీశ్వర రావు, జిల్లా ప్రోగ్రాం అధికారులందరూ ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. అన్ని ప్రాథమిక/పట్టణ/సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు లింక్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. లూసీ, డా. బి.ఉమావతి DPMO-NHM, మిగతా జిల్లా ప్రోగ్రాం అధికారులందరూ పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన హోంగార్డుకు రూ.4 లక్షల ఆర్థిక సాయం అందజేసిన ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, పతాకం న్యూస్:** పోలీస్ శాఖలో నాలుగు దశాబ్దాల పాటు విశేష సేవలందించి పదవీ విరమణ పొందిన హోంగార్డుకు తోటి సిబ్బంది అండగా నిలిచి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. అనకాపల్లి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో మరియు కమ్యూనికేషన్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వహించి ఇటీవల రిటైర్ అయిన ఉప్పలపు రాజారావుకు, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శనివారం తన కార్యాలయంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనకాపల్లి మరియు అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని హోంగార్డులు తమ ఒకరోజు డ్యూటీ అలవెన్స్‌ను స్వచ్ఛందంగా విరాళంగా సేకరించారు. ఇలా సేకరించిన రూ. 4,06,410/- విలువైన చెక్కును ఎస్పీ గారు రాజారావుకు అందజేసి, ఆయన విశ్రాంత జీవనం సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. "రాజారావు తన విధులను ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో నిర్వహించారు. పదవీ విరమణ పొందిన సహోద్యోగికి ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో తోటి హోంగార్డులు చూపిన చొరవ మరియు వారి సేవా స్ఫూర్తి అభినందనీయం" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీ సి.హెచ్.తిలక్ బాబు, జూనియర్ అసిస్టెంట్ రమేష్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసుల కార్డన్ సెర్చ్.. 600 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం ..11 బైక్‌లు సీజ్



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ఎస్పీ ఆదేశాల మేరకు వీరఘట్టం మండలం హుస్సేన్‌పురం గ్రామంలో పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ను శనివారం నిర్వహించారు. చినమేరంగి, ఎల్విన్‌పేట సీఐల నేతృత్వంలో వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కురుపాం, ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా అక్రమ మద్యం తయారీకి ఉపయోగిస్తున్న సుమారు 600 లీటర్ల బెల్లం ఊటలను పోలీసులు గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే సరైన పత్రాలు చూపలేకపోయిన 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

## కేంద్రీయ విద్యాలయానికి గ్రీన్ సిగ్నల్




**కొత్తూరు, పతాకం న్యూస్:** అనకాపల్లికి దశాబ్ద కాలం క్రితం మంజూరైన కేంద్రీయ విద్యాలయం ఎట్టకేలకు ఈ ఏడాది ప్రారంభం కానున్నది. సొంత భవనాలు నిర్మించే వరకు తాత్కాలికంగా పట్టణంలోని ఉడ్‌పేటలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో తరగతులు నిర్వహిస్తారు. రానున్న విద్యా సంవత్సరం (2026-27)లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తారు. ఈ మేరకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది.

## కాంపిటేషన్ చట్టంపై విద్యార్థులకు అవగాహన



**సబ్బవరం, పతాకం న్యూస్:** దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో శనివారం 'డీఎస్ఎన్ఎల్‌యూ- కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)' ఆధ్వర్యంలో 'పోటీ చట్టం'పై న్యాయ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీసీఐ చైర్‌పర్సన్ రవ్‌నీత్ కౌర్ (ఐఏఎస్) ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంపిటీషన్ చట్టంపై విద్యార్థులకు, విద్యావేత్తలకు మధ్య అర్థవంతమైన చర్చ జరిగేందుకు సీసీఐ ఔట్ రీచ్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కాంపిటీషన్ చట్ట వ్యవస్థలో ఇటీవల తీసుకొచ్చిన ముఖ్యమైన సంస్కరణల గురించి ఆమె వివరించారు. కాంపిటీషన్ సవరణ చట్టం-2023తో సంస్థల నియంత్రణ గణనీయంగా అభివృద్ధి చెందిందన్నారు. కొత్తగా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనడానికి, భారతదేశాన్ని ప్రపంచ వ్యాపార కేంద్రంగా మార్చడానికి సీసీఐ కృషి చేస్తున్నదని చెప్పారు. న్యాయ సలహాదారు ధీరజ్ గుప్తా, ఎఫ్ఏ డైరెక్టర్ శేఖర్ సీసీఐ పాత్రపై ఉపన్యసించారు. అనంతరం సీసీఐ చైర్‌పర్సన్ రవ్‌నీత్ కౌర్‌ను, వర్సిటీ వీసీ సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ కాంపిటీషన్ లా సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ దీప్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పింఛన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి



**విజయనగరం, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వ లక్ష్యం ప్రజల సుఖసంతోషాలు అని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. శనివారం ఉదయం విజయనగరం మండలం బియ్యాల పేట గ్రామంలో పింఛన్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ పాలన ఏ విధంగా ఉంది అదేవిధంగా ప్రజా సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయా లేదా అని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పింఛన్ దారులు బాధపడకూడదని సదుద్దేశంతో ఒక్కరోజు ముందుగానే పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధిని చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బియ్యాల పేట సర్పంచ్ పడగల అబద్ధం, రామకృష్ణ, ఎంపీడీవో వెంకట్రావు వైస్ ప్రెసిడెంట్ ఎన్. ఈశ్వరరావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు గంటా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి
# రూ.10 లక్షల చెక్కు అందజేత



**పార్వతీపురం, పతాకం న్యూస్:** సాలూ రు రూరల్ ఏఎస్ఐ ఆర్.ఆదినారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి ఎస్‌బీఐ నుంచి మంజూరైన రూ.10 లక్షల చెక్కును ఎస్పీ మాధవరెడ్డి అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. పోలీసు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అందరికీ స్టేట్ బ్యాంకు పోలీసు సాలరీ ప్యాకేజీని ఇప్పటికే ప్రారంభించామన్నారు. ఎవరైనా పోలీసు ఉద్యోగి విధి నిర్వహణలో మరణిస్తే వారి కుటుంబానికి బ్యాంకు ఆర్థిక సాయం అందజేయనుందన్నారు. గతేడాది ఆగస్టు 8న ఆదినారాయణ మృతి చెందిన నేపథ్యంలో ఆయన భార్య పద్మావతికి బ్యాంకు అధికారుల సమక్షంలో చెక్కును అందజేశామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, ఎస్పీ సీఐ రమణమూర్తి, ఆర్ఐలు నాయుడు, రాంబాబు, పార్వతీపురం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎం.ఆర్.దత్, డిప్యూటీ మేనేజర్ వేణుగోపాల్, ఏఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 70 బృందాలతో ఇంటింటా సర్వే



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లా యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా, ప్రణాళికా బద్ధంగా పనిచేస్తోంది. గత నాలుగు రోజులుగా ప్రబలిన డయేరియా వ్యాధి తీవ్రత తగ్గింది. బాధితులెవరూ ప్రమాదకర పరిస్థితిలో లేర'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో నివారణకు శనివారం నుంచి 70 బృందాలతో ఇంటింటా సర్వే చేయనున్నట్టు వెల్లడించారు. డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కాలువలు పరిశీలించారు. అలాగే సాయంత్రం ఆయన స్థానిక మునిసిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'శ్రీకాకుళంలో డయేరియా నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాం. 13 కొత్త కేసులు వచ్చాయి. వ్యాధి వ్యాప్తికి కారణాలను విశ్లేషిస్తూ గత నాలుగు రోజులుగా నీటి నమూనాలు సేకరించి.. విశాఖపట్నంలో ల్యాబ్‌కు పంపాం. ఇందులో 11 శాంపిళ్లలో డయేరియాకు కారణమైన 'ఈ-కోలి' బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఒకటి బోరు వాటర్ ద్వారా, రెండు నేరుగా నాగావళి నది నుంచి, మిగిలిన 8 శాంపిళ్లు మునిసిపల్ కొళాయిల ద్వారా సేకరించిన నీటినమూనాల్లో ఉన్నట్లు తేలింది. నీరు కలుషితం కాకుండా ముందుగా డయేరియా ప్రభావిత ప్రాంతాలతోపాటు నగరంలో ముఖ్యమైన అన్ని మునిసిపల్ తాగునీటి సరఫరా ట్యాంకులను శుభ్రం చేశాం. ఇప్పటికీ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం. 35 లీకులను గుర్తించి వాటిని సరిచేశాం. టెక్నాలజీ, పరీక్షల ద్వారా మరిన్ని లీకేజీలను గుర్తించి, నగరమంతా లీకులను సరిచేస్తాం. డయేరియా ప్రభావిత ప్రాంతాలైన మంగువారితోట, దమ్మలవీధి, కాకివీధి, కంపోస్టు కోలనీ సచివాలయాల పరిధిలో ఇంటింటికీ సర్వే 50 టీమ్‌ల ద్వారా జరుగుతోంది. శనివారం నుంచి అదనంగా మరో 20 టీమ్‌లను కూడా ఏర్పాటు చేశాం. వీరంతా ప్రతీ ఇంటికీ వెళ్లి పూర్తి వివరాలను సేకరిస్తారు. ప్రజలకు అవగాహన కూడా కల్పిస్తారు. నగరంలోని ప్రతీ రెండు సచివాలయాలకు ఒక ట్రాక్టర్, ఒక జేసీబీ, ఆరుగురు సిబ్బందిని నియమించాం. వీరంతా కాలువల్లో పూడిక తీతలు, పారిశుధ్య పనులు చేపడతారు. ప్రతీ మూడు డివిజన్లకు ఒక అధికారిని నియమించాం. గ్రామీణ నీటి సరఫరా సంస్థ ద్వారా నిర్వహించే అన్ని ఆర్వో ప్లాంట్లను ఇప్పటికే తనిఖీ చేశాం. అందరికీ నోటీసులు కూడా జారీ చేసాం. ఆహార నియంత్రణశాఖ అధికారులతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే కొన్ని దుకాణాలను కూడా మూసివేయించాం. ఇదే సమయంలో దోమల నివారణకు గాను లార్వా దశలోనే నాశనం చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రజలు కూడా ఇంటి పరిసరాల్లో చెత్తను వేయకుండా, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అందరూ వేడినీటిని తాగాలి. బయటి ఆహారాన్ని తీసుకోవద్ద'ని కలెక్టర్ సూచించారు.

## బాణాసంచా పేలుడు ఘటనపై
# పలువురు మంత్రులు దిగ్భ్రాంతి

**సామర్లకోట, పతాకం న్యూస్:** కాకినాడ జిల్లా వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన ఎంతో బాధ కలిగించిందని మంత్రుల అచ్చెన్నాయుడు, గొట్టిపాటి, నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు మంత్రులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితులకు తక్షణ వైద్య సహాయక



చర్యలు చేపట్టాలని వైద్య శాఖ సెక్రటరీ, డీఎంఇ, డీఎంహెచ్‌వోలను మంత్రి సత్య కుమార్ ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ వైద్యులు, ఇతర సిబ్బందిని ఘటనాస్థలికి వెంటనే పంపాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ బృందాలు అప్రమత్తంగా పని చేయాలని మంత్రి సుభాష్ సూచించారు. మంటల్లో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను మరింత కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పేలుడుకు గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రులు స్పష్టం చేశారు.

# కలుషిత తాగునీరు నుంచి ప్రజలు, విద్యార్థుల ప్రాణాలకు బరోసా కల్పించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** తాగునీరు,పాలు తాగితే ప్రాణాలు పోతున్నాయనీ,కారణం కల్తీ పాలు,కలుషితమైన నీరే కారణమనీ దీని కారణంగా విద్యార్థులు ,ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ప్రజలు,విద్యార్థులు ప్రాణాలకు బరోసా కల్పించాలనీ వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.శనివారం వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ పాలు,కలుషితమైన తాగునీరు కారణంగా మరణాలు జరుగుతున్నాయన్నారు. రాజమండ్రిలో పాలు కల్తీ కారణంగా మరణాలు జరిగిన విషయం తెలిసిందనన్నారు. గత ఏడాది గుర్లలో డయేరియా 11 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే అన్నారు. ప్రజలకు తాగునీరు విషయంలో ప్రజలకు బరోసా లేదన్నారు. కురుపాం వసతి గృహంలో డయేరియతో నలుగురు గతంలో చనిపోయారు, మరల ఇప్పుడు ఐదుగురు బాలికలు డయేరియాతో పార్వతీపురం ఆసుపత్రిలో చేరారన్నారు. శ్రీకాకుళంలో డయేరియాతో మరణాలు సంభవించాయన్నారు. ఈ పరిణామాలు అన్ని చూస్తుంటే రాష్ట్రంలో జిల్లాలో ప్రభుత్వ యాత్రాంగం నిర్వీర్యమయ్యాయన్నారు. మంత్రులు నాకు జ్వరం వచ్చింది నేను ఎవరికి చెప్పుకోవాలి అన్న వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. గుర్లలో జరిగిన ప్రమాదంలో మేము ఆర్థికంగా ఆదుకోవడం జరిగిందన్నారు. ఆరోగ్య వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు.గతంలో గిరిజన వసతి గృహాలు లో ఆర్వో ప్లాంట్ కు ఏర్పాటు చేస్తామనీ మంత్రులు ప్రకటించారు. సౌకర్యాలు కల్పిస్తే ఎందుకు ఆసుపత్రిలో విద్యార్థులు చేరుతున్నారని ప్రశ్నించారు.ప్రభుత్వం ,ప్రజాప్రతినిధులు, గిరిజన శాఖ మంత్రి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. 20 రోజులు నుంచి ఆసుపత్రిలో విద్యార్థులు ఉంటే నాయకులు,గిరిజన శాఖ మంత్రి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. మంచి నీళ్లు అందించే పరిస్తితిలో కూటమి ప్రభుత్వం లేదన్నారు. కేవలం నెలకు ఒకసారి జిల్లాలకు వచ్చి పెన్షన్లు ఇవ్వడం తప్ప చేసింది ఏమి లేదన్నారు.

## మార్కెట్ కమిటీ కార్యకలాపాలు విస్తృతం చేయండి



**కొత్తవలస, పతాకం న్యూస్:** కొత్తవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాకలాపాలను మరింత విస్తృతం చేయాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాలక మండలి సభ్యులకు సూచించారు. కొత్తవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చౌక్కాకుల మల్లునాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆమె.. మార్కెట్ కమిటీకి సంబంధించి శాశ్వత కార్యాలయానికి స్థలం కేటాయింపు కోసం తీర్మానం చేశారు. కొత్తవలసలో రైతు బజార్ ఏర్పాటు విషయమై చర్చించారు. పశువుల ఆరోగ్యం కోసం మార్కెట్ కమిటీ ద్వారా రూ.50వేలు విలువైన మందులను పంపిణీ చేసి, వైద్యం అందించాలని నిర్ణయించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందించడం కోసం తీర్మానం చేశారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయబాబు, వైస్‌చైర్మన్ తూర్పాటి ఆదిబాబు, ఎస్.కోట పీఏసీఎస్ అధ్యక్షుడు జి.సింహాలంనాయుడు, డైరక్టర్లు పాల్గొన్నారు.

## మా భూములకు హక్కులు కల్పించండి



**చీపురుపల్లి, పతాకం న్యూస్:** వందల సంవత్సరాలుగా సాగులో ఉన్న తమ భూములకు శాశ్వతంగా రికార్డు పరమైన హక్కులు కల్పించాలని చీపురుపల్లిలోని జి.అగ్రహారానికి చెందిన ఇనాం రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మొర పెట్టుకోనున్నారు. ఈ మేరకు వారంతా జి.అగ్రహారంలోని సచివాలయం వద్ద సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడారు. జి.అగ్రహారం పరిధిలోని 1190 ఎకరాల భూమి తాతల కాలం నుంచి తమ సాగులో ఉందని తెలిపారు. 375 మంది రైతులు ఈ భూముల్ని సాగు చేసుకుంటున్నామన్నారు. సుమారు 5వేల కుటుంబాలు ఈ భూములపై ఆధార పడి జీవిస్తున్నాయని చెప్పారు. అయితే ఈ భూములు ఇనాం పరిధిలో ఉన్నందును తమకు ఎటువంటి శాశ్వత భూ హక్కులు దాఖలు పడలేదన్నారు. 1బీలు జారీ కావడం లేదని, దీని కారణంగా క్రయవిక్రయాలు జరపలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని చె ప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు రౌతు కామునా యుడు, పార్టీ నాయకుడు పతివాడ శ్రీను మాట్లాడు తూ ఈ సమస్యను గతంలో ఎమ్మెల్యే కళా వెంకటరావుకు వివరించామన్నారు.

## దేశ వ్యాప్తంగా హెచ్‌పీవీ టీకాను ప్రారంభించిన మోడీ



**రాజస్థాన్ :** దేశవ్యాప్తంగా హెచ్‌పివి టీకా కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఈరోజు ఉదయం రాజస్థాన్‌లోని అజ్మేర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం హెచ్‌పివి టీకా కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా 14 సంవత్సరాల బాలికలకు 'గార్డాసిల్' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్‌పీవీ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పించనున్నట్లు కేంద్రం వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో సిఎం చంద్రబాబు విజయనగరం జిల్లా రావివలసలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణలో మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని కోఠిలో ప్రారంభిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 6.75 లక్షల మందికి ఈ వ్యాక్సిన్ పంపిణీ చేస్తారు.

## 'మా భూములు ఇవ్వలేం'




**భోగాపురం, పతాకం న్యూస్:** ఐటీ పార్కులకు, ప్రైవేటు సంస్థల కోసం చేపడుతున్న భూసేకరణ నుంచి భోగాపురం తూర్పు, పడమర ఖండాలను మినహాయించాలని ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు కోరారు. భోగాపురంలోని జాతీయ రహదారి సమీపంలో చేపడుతున్న నిరసన వేదిక వద్ద వారు విలేకర్లతో మాట్లాడారు. భూసేకరణను అడ్డుకోవడానికి గత 20 రోజులుగా నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు. ఎయిర్ పోర్టుకు 900 ఎకరాలు ఇచ్చామన్నారు. ఇంకా ఇవ్వడానికి రైతుల వద్ద భూములు లేవన్నారు. దీనిపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు.

## పనులు పూర్తయిన వెంటనే సాగునీరు



**టెక్కలి, పతాకం న్యూస్:** బొర్రంపేట గ్రామ సమీపంలోని కడగంటి రిజర్వా యర్‌కు సంబం ధించిన మిగిలిన పనులు పూర్తయి న వెంటనే పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి తెలిపారు. కడగండి రిజర్వాయర్‌కు సంబంధించి మిగిలి న పనులను ఆయన పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణంలో భూ ములు కోల్పోయిన బొర్రంపేట గ్రామానికి సంబంధించిన రైతులు కె.కృష్ణమా చారి, ఎం.అన్నాజీరావు, ఎం.నీలంనాయుడు, కె.భాస్కరరావుతోపాటు మరికొంత మంది రైతులకు ఇంతవరకు నష్టపరిహారం అందలేదని, శివారు పొలాలకు సా గునీరు అందడం లేదని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. నిధులకు ప్రతిపాధిం చామని, మంజూరైన వెంటనే పనులు పూర్తి చేయించి పూర్తిస్థాయిలో సాగు నీరు అందేలా చూస్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు. అనంతరం యంబరాం గ్రా మంలో జరుగుతున్న భూ రీసర్వేను పరిశీలించారు. మోదుగవలస ఆర్‌ఆర్ కా లనీ అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మంజూరైన స్థలంలో వేరొక కుటుంబం ఇంటి నిర్మాణం చేపడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుపై పరిశీలించారు. అదే గ్రా మంలోని పాఠశాలను పరిశీలించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో ప్ర జల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. పీఏసీఎస్ చైర్మన్ కె.మన్మ?థరా వు, డీటీ నీలిమ, సీనియర్ అసిస్టెంట్ గవరయ్య, ఆర్ఐ శ్రీనివాసరావు, నీటి పారుదలశాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో
# దంపతులు మృతి



**తిరుపతి, పతాకం న్యూస్:** చంద్రగిరి మండలం మామండూరు వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై వెళుతున్న కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టింది. ప్రమాద ధాటికి కారు పల్టీలు కొట్టి అవతలి రోడ్డుపై పడిపోయింది. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఇద్దరు దంపతులు మృతి చెందారు. అరుణాచలం దర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతులను హైదరాబాద్‌కు చెందిన అశోక్, చంద్రకళగా గుర్తించారు.

## మావోయిస్టుల లొంగుబాటు పాలసీపై రేవంత్‌రెడ్డి కీలక హామీ



**హైదరాబాద్, పతాకం న్యూస్:** మావోయిస్టుల అగ్రనేతలతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ క్రమంలో మావోయిస్టుల లొంగుబాటు పాలసీపై సీఎం చర్చించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరిని పలకరించారాయన. మావోయిస్టుల పునరావాసంపై హామీ ఇచ్చారు. లొంగిపోయిన మావో నేతలపై ఉన్న రివార్డును వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అనుమతిస్తే జైల్లో ఉన్న మావోయిస్టులను కలుస్తామని మావోయిస్టు నేతలు పేర్కొన్నారు. అలాగే , లొంగిపోయిన మావోయిస్టుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లొంగిపోవటానికి చొరవ చూపిన ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కి మావోయిస్ట్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. చట్టప్రకారం పునరావాసం, రక్షణ పరమైన సహకారం తమ ప్రభుత్వం అందిస్తుందని భరోసా కల్పించారు. మావోయిస్టుల లొంగుబాటుపై తెలంగాణ అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలిపారు. మావోయిస్టులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు బాగున్నాయని మావోయిస్టులు అన్నారు. ఈ ప్రభుత్వ లొంగుబాటు పాలసీ బాగుందని సీఎంకు మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ తెలిపారు. తమ భవిష్యత్ ప్రణాళికలపై సీఎం రేవంత్‌రెడ్డికి మావోయిస్టు అగ్రనాయకులు వివరించారు.

## స్లీపర్ బస్సు, ట్రక్కు ఢీ.. ఆరుగురు మృతి




**రాజస్థాన్, పతాకం న్యూస్:** స్లీపర్ బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఆరుగురు అక్కడికకక్కడే మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ఘటన రాజస్థాన్‌లోని బలోత్రాలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రమాదానికి గురైన స్లీపర్ బస్సు జోధ్‌పుర్ నుంచి సాంచోర్‌కు బయలుదేరింది. బలోత్రా జిల్లా సర్వాడి గ్రామం సమీపంలోకి రాగానే బస్సు డ్రైవర్ ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. అయితే, డ్రైవర్ వైపు ఉన్న ప్రయాణికులు ఎక్కువగా గాయపడినట్లు పోలీసులు చెబుతున్నారు. స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డవారిని రక్షించారని చెప్పారు. రెండు వాహనాలు అధిక వేగంతో వెలుతున్నప్పుడు ఈ ప్రమాదం జరగడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు.

## కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత.. పంచాయతీ కార్మికుల నిరసన




**కాకినాడ, పతాకం న్యూస్:** గ్రామ పంచాయతీ కార్మికులకు 2026 - 27 రాష్ట్ర బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించాలని, 21 వేల జీతం ప్రభుత్వం చెల్లించాలని, గత పోరాటాల ఫలితంగా ఇచ్చిన ప్రభుత్వ జీవోలను అమలు చేయాలని, టెండర్ల విధానం రద్దు చేయాలని, వివిధ పంచాయతీల్లో బకాయిలు ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ .... రాష్ట్రవ్యాప్తంగా ఛలో కలెక్టరేట్ కార్యక్రమం పిలుపు కాకినాడలో ఉద్రిక్తతకు దారి తీసింది. యూనియన్ నాయకుడు సి. హెచ్ అజయ్ కుమార్ చెంప పై దాడి చేసి హెడ్ కానిస్టేబుల్ పౌలు కొట్టడంతో కార్మికులు ఆగ్రహంతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు అయితా బత్తుల రామేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, రూరల్ కార్యదర్శి టి రాజా, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు సి. హెచ్ అజయ్ కుమార్, పెంకే వీరభద్రరావు, ఎమ్. వెంకటరమణ వివిధ పంచాయతీల నాయకులు మాట్లాడుతూ నాయకులపై అరాచకంగా ప్రవర్తించిన హెడ్ కానిస్టేబుల్ పౌలును వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా ఎస్పీ ని కోరారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ ను యూనియన్ ప్రతినిధి వర్గం కలిసి జిల్లాలో పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరంగా జె. సి దృష్టికి తీసుకువెళ్ళారు. స్వచ్ఛ భారత్ అని, పరిసరాల పరిశుభ్రత అని వివిధ రకాల పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులకు తినడానికి, జీవించడానికి సరిపడే జీతాలు ఇవ్వడం లేదని అన్నారు. ఇంద్రపాలెం, తూరంగి, రమణయ్యపేట తదితర పంచాయతీల్లో నెలల తరబడి జీతాలు బకాయిలు ఉన్నాయని అప్పులతో జీవిస్తున్నామని, సంక్షేమ చర్యలు ఏమీ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలపై అధికారులతో ఒక జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని యూనియన్ ప్రతినిధి వర్గం జె సి నీ కోరగా త్వరలో జాయింట్ మీటింగ్ నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

# తిరుపతి విమానాశ్రయం సరికొత్త రికార్డు ..

## తొలిసారిగా 10 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలు



**తిరుపతి, పతాకం న్యూస్:** పెద్ద విమానాలతో తిరుపతి రన్‌వే కళకళలాడుతోంది. విమానాశ్రయంలో రద్దీ పెరిగింది. తొలిసారిగా 10 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఈ ఏడాది 11.5 లక్షల లక్ష్యం అని ఏపీడీ భూమినాథన్ వెల్లడించారు. తిరుపతి విమానాశ్రయం సరికొత్త రికార్డులు నమోదు చేస్తోంది. మొట్ట మొదటిసారిగా ఆర్థిక సంవత్సరం ముగియక ముందే అనగా జనవరి నాటికే 10 లక్షల మంది ప్రయాణికుల రాకపోకల మైలురాయిని దాటి రికార్డులు సృష్టిస్తోంది. చిన్న విమానాల స్థానంలో ఎయిర్ బస్ అందుబాటులోకి రావడరతో పాటు భక్తుల రద్దీ పెరగడంతో ఈ ఘనత సాధ్యమైందని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్ పేర్కొన్నారు. గత సంవత్సరం 9.9 లక్షల మంది ప్రయాణించారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అనగా మార్చిలోగా 11.5 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తిరుపతి విమానాశ్రయం రన్‌వే దక్షిణాది విమానాశ్రయాల్లో ఇదే అత్యంత పొడవైనది. దీని పొడవు 3,800 మీటర్లు, ఎయిర్‌పో అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలోని చెన్నై, హైదరాబాద్‌లో శంషాబాద్ మినహా కంటే ఇది పెద్దది అని, ఫ్లోరింగ్ పనులు పూర్తి అయితే మరింత బలోపేతం అవుతుందని ఏపీడీ భూమినాథన్ వెల్లడించారు.

గతంలో 72 సీట్లు ఉండగా, ఏటీఆర్ విమానాలు ఎక్కువగా నడిచేవి. ఇప్పుడు ఏటీఆర్ విమానాల స్థానంలో 230 సీట్ల సామర్థ్యం గల ఎయిర్ బస్సులు నడుస్తున్నాయి. దీంతో సర్వీసుల సంఖ్య రోజుకు 16కు చేరింది. వేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు కనెక్టివిటీ పెరగడం వల్ల ఉదయం వచ్చి సాయంత్రం వెళ్లే వెసులుబాటు కూడా ఉంది. శ్రీవాణి టికెట్లు అందుబాటులో ఉండటం రద్దీ అనూహ్యంగా పెరగడానికి ప్రధాన కారణాలు ఉన్నా, నెలకు సగటున లక్ష మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. భారీ టెర్మినల్ భవన నిర్మాణ వ్యయం, తరుగుదల కారణం. ప్రస్తుతం ఈ విమానాశ్రయం ఏటా సుమారు రూ.30 నుంచి రూ.32 కోట్లు నష్టాల్లో ఉంది. నష్టాలు అధిగమించేందుకు కమర్షియల్ ఆదాయాన్ని పెంచుకోవాలని ఇటీవల కేంద్ర మంత్రి సైతం సూచించారు. విమానాశ్రయం సమీపంలో ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా హోటల్ లేదా రెస్టారెంట్ లేకపోవడం పెద్ద లోటు. ఎయిర్ పోర్టు భూములు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చినవి కావడం చేత, నిబంధనల ప్రకారం అక్కడ వాణిజ్య కార్యకలాపాలు హోటల్ వంటివి చేపట్టడం పై కొన్ని ఆంక్షలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి సర్వే నిర్వహించనున్నారు. అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపారు. భద్రతా కారణాలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే దీనికి సంబంధించి నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. అందుబాటులోకి 'డిజియాత్ర' సేవలు: కోయంబత్తూరు తరహాలోనే తిరుపతిలోను కూడా త్వరలో 'డిజియాత్ర' సేవలు అందుబాటులోకి వస్తాయని ఏపీడీ భూమినాథన్ ఈ సందర్భంగా తెలిపారు. భద్రత పరంగా విమానాశ్రయం పటిష్ఠంగా ఉందన్నారు. దాదాపు 800 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉందని ఏపీడీ పేర్కొన్నారు. రాత్రి పూట ల్యాండింగ్ సౌకర్యం కూడా ఉందని తెలిపారు. విమానయాన సంస్థల డిమాండ్ ఆధారంగా 24 గంటల సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు దుబాయ్, సింగపూర్ వంటి దేశాల నుంచి తిరుపతికి నేరుగా విమానాలు నడిపే అంశం పరిశీలనలో ఉంది. సింగపూర్ ఎయిర్? లైన్స్ సానుకూలంగా ఉన్నా విమానాల లభ్యత దగ్గర నుంచి పైలట్ల కొరత, మంత్రిత్వశాఖ అనుమతుల వంటి అంశాల పైనే ఇది ఆధారపడి ఉంది. ప్రైవేట్ జెట్?లు, చార్టర్డ్ విమానాల కోసం బేగంపేట తరహాలోనే 'జనరల్ ఏవియేషన్' టెర్మినల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు కూడా ఉన్నాయి.

## అదానీ డేటా సెంటర్‌కు వందల ఎకరాల భూకేటాయింపులు దారుణం : శ్రీనివాసరావు

**విజయవాడ, పతాకం న్యూస్:** విశాఖలో గూగుల్ సంస్థ రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఒక గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది... కానీ దానికి భిన్నంగా దీన్ని మూడు ముక్కలు చేసి అదానీకి కేటాయిస్తున్నట్లు ఈ నెల 24వ తేదీన రాష్ట్ర క్యాబినెట్ ప్రకటించడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. దీనికి సంబంధించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. గత ప్రభుత్వం ఇదే అదానీకి రుషికొండ 3 లో 300 ఎకరాలు కేటాయించినా దాని ప్రారంభించకపోయినా మరోచోట 600 ఎకరాలు కేటాయించటాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. డేటా సెంటర్ పేరుతో వందలాది ఎకరాలు అదానీకి కట్టబెట్టడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని స్పష్టం చేశారు. గత 30 సంవత్సరాలుగా సింహచలం భూములలో నివాసం వుంటున్న పంచ గ్రామాల ప్రజలకు పట్టాలివ్వకుండా ఇప్పుడు దేవస్థానం భూములను చట్టవిరుద్ధంగా అదానీకి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. విశాఖపట్నం జిల్లాలో ఆనందపురం మండలం తార్లవాడలో 308 ఎకరాలతోపాటు మరో 106 ఎకరాల భూమిని సెమీ కండక్టర్ కోసం కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అదానీ గ్రూప్ ఏఐ డేటా సెంటర్ .. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 1,000 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు అదానీ ఇన్‌ఫ్రా ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపిందని, ఇందుకోసం మూడు ప్రత్యేక కంపెనీలకు(ఎస్‌పీవీలకు) 601.4 ఎకరాల భూమిని కేటాయించనున్నారని చెప్పారు. అలాగే ఆడివివరం పంచాయతీ సింహాచలం దేవస్థానానికి సంబంధించి 256.47 ఎకరాల భూమి, రాంబిల్లి మండలంలో ఎసఇజెడ్‌లో కొన్ని భూములు కేటాయించడం జరుగుతుందన్నారు. పేరుకి గూగుల్ డేటా సెంటర్ అని చెబుతున్నా ఆ భూములన్నీ ఆదానికి కేటాయించడం జరుగుతుందన్నారు. గూగుల్ సంస్థ పెట్టనున్న డేటా సెంటర్‌ను అదానీకి కట్టబెట్టడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. పేరు గూగుల్ ... భూమి మాత్రం అదానికి అనే పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికే తార్లవాడలో ఉండే దళితులు దీన్ని వ్యతిరేకిస్తునప్పటికీ స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిడితో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనితోపాటు సింహాచలం దేవస్థానానికి సంబంధించిన భూములను కేటాయించడం చర్చనీయాంశంగా విశాఖలో మారిందన్నారు. దీనికి ప్రధాన కారణం 275 సర్వే నెంబర్లలో 6000 మంది పేదలు



పాకలేసుకొని జీవిస్తూ ఉన్నారని తెలిపారు. చిన్నగదిలి మండలంలో ఉన్న అడివి వరం, వెంకటాపురం, పెందుర్తి మండలం వేపగుంట, చీములపల్లి, పురుషోత్తపురంలో దాదాపు 13 వేల మంది ప్రజలు దేవస్థానం భూముల్లో ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని, వాటిని రెగ్యులర్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అనేక ఇబ్బందులు పెడుతున్నదని మండిపడ్డారు. ఈ భూమి సమస్య విశాఖ నగరంలో 17 వార్డులు, ఐదు అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్న సమస్య అని చెప్పారు. ప్రతీ ఎన్నికల సందర్భంగా ఈ భూ సమస్య పరిష్కరం చేస్తామని పాలకులు తెలియజేస్తున్నా నేటికీ పరిష్కారం చేయకుండా మరింత జటిలం చేస్తున్నారని ఆరోపించారు. వీటిని రెగ్యులర్ చేయడానికి దేవస్థానం భూములని చెప్పి అనేక ఇబ్బందులు పెడుతున్నారని, అదే దేవస్థానం భూములను మాత్రం ఆదానీ గెస్ట్ హౌస్ కోసం, డేటా సెంటర్ కోసం కట్టబెట్టడం ఎంతవరకు సమంజసం ? అని ప్రశ్నించారు. గతంలో విశాఖ భూములు అదాని డేటా సెంటర్‌కి కేటాయించిన భూముల్లో నేడు కనీసం పని కూడా జరగకుండా ఆ భూముల మీద పెత్తనం చేస్తూ మళ్లీ నేడు గూగుల్ సెంటర్ పేరుతో ఆదానికి భూములు కట్టబెట్టడం దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తుల్ని కాపాడాల్సింది పోయి ఆస్తుల్ని ప్రైవేటు కంపెనీలకి ధారాదత్తం చేయటం సరైంది కాదు అని అన్నారు.

## కనీస వేతనాల కోసం పంచాయతీ కార్మికుల ధర్నా

**గుంటూరు, పతాకం న్యూస్:** పంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాసరావు, శ్రామిక మహిళా కన్వీనింగ్ కమిటీ జిల్లా కన్వీనర్ జి.రమణ, సిఐటియు జిల్లా నాయకులు ఎస్.కె.మస్తాన్‌వలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.3.32 లక్షలతో భారీ బడ్జెట్ ప్రకటించినా పంచాయతీ కార్మికులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. మున్సిపల్ వర్కర్లు చేస్తున్న పనే గ్రామాల్లో పంచాయతీ వర్కర్స్ చేస్తున్నా జీతభత్యాల్లో భారీ వ్యత్యాసం ఉందని తెలిపారు. 2025 జులై 20న గ్రీన్ అంబాసిడర్లకు రూ.10 వేలకు తక్కువ కాకుండా జీతం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జీవోనిచ్చినా జిల్లాలో ఎక్కడా రూ.6వేలకు మించి ఇవ్వట్లేదని, దశాబ్దాల తరబడి పనిచేస్తున్న టెండర్ కార్మికులకు రూ.13 వేలకు మించి వేతనం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు చూస్తుంటే ఆకాశాన్ని అంటుతున్నాయని, చాలీచాలని జీతాలతో కార్మికుల కుటుంబాలు ఏ విధంగా జీవించాలని ప్రశ్నించారు. ఒక్కొక్క పంచాయతీలో 3 నుంచి 12 నెలలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పంచాయతీల్లో వచ్చే ఆదాయంతో నిమిత్తం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి రూ.21 వేలు జీతం ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ గ్రాడ్యుటీ, పెన్షన్, సెలవులు అమలు చేయాలని, అంత్యక్రియలకు రూ.20 వేలు,



సాధారణ మృతికి రూ.5 లక్షలు, ప్రమాద మతులకు రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిఆర్ఓ ఎన్ఎస్‌కె.ఖాజావలికి, డిపిఒకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి సిహెచ్.రామారావు అధ్యక్షత వహించగా, నాయకులు పి.మేరకరావు, ఎన్.రత్నకుమారి, ఎన్.వీరయ్య, ఇబ్రహీం, నారాయణమ్మ, అంకమ్మరావు పాల్గొన్నారు.

## ఢిల్లీలో మళ్లీ ఎన్నికలు పెట్టండి...
# మోడీకి కేజ్రీవాల్ సవాల్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్‌షా కుట్రలు పన్నారని, ఇప్పుడు దేశానికి వారు క్షమాపణ చెప్పాలని ఆప్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో కేజ్రీవాల్ సహా 23 మంది నిందితులకు ప్రత్యేక కోర్టు విముక్తి కల్పించిన అనంతరం ఆయన తొలిసారి మీడియా ముందుకు వచ్చారు. ఢిల్లీలో మళ్లీ ఎన్నికల జరపాలని మోదీకి సవాలు విసిరారు. 'ఏళ్ల తరబడి నేను నిజాయితీని కూడబెట్టుకున్నాను, డబ్బులు కాదు. అవినీతి, అవకతవకలకు పాల్పడలేదు. సీఐబీ, ఈడీ నాపై దాడి చేశాయి. ప్రాథమిక ఆధారాలు లేకుండా అరెస్టు చేశారు. ఇవాళ కోర్టు 600 పేజీల తీర్పులో ఈ కేసులో చిన్న సాక్ష్యం కూడా లేదని తేల్చిచెప్పింది. ఆమ్ ఆద్మీ పార్టీని అంతం చేయడానికి ఇద్దరు వ్యక్తులు.. మోదీ, అమిత్‌షా కుట్ర పన్నారు. ఇవాళ ఆ ఇద్దరూ దేశానికి క్షమాపణలు చెప్పాలి' అని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీకి మళ్లీ ఎన్నికలు జరిపాలని, ఇందుకు మోదీ సిద్ధమేనా అని కేజ్రీవాల్ సవాలు విసిరారు. ఎన్నికల్లో 10 సీట్లకు మించి వాళ్లు గెలిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. కోర్టు తీర్పు అనంతరం కేజ్రీవాల్ సహా పార్టీ నేతలు రోడ్‌షో నిర్వహించారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి

**కడప, పతాకం న్యూస్:** కడప అర్బన్ అర్ధాంతరంగా ఆగిపోయిన కడప ఎర్రముక్కపల్లి -విశ్వనాధపురం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించాలని రైల్వే బ్రిడ్జి సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బ్రిడ్జి నుంచి కడప కలెక్టరేట్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే బ్రిడ్జి సాధన కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎర్రముక్కపల్లి-విశ్వనాధపురం మధ్య ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని పేర్కొన్నారు. చేస్తూ వివిధ రూపాల్లో ఆందోళన చేసిన అధికార యంత్రాంగం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్పొరేషన్ అధికారులు నిధులు కేటాయించామని చెబుతున్నా విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేషన్ నిధులతో, లేదా ప్రభుత్వం నిధులతో పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం వెంటనే పనులు ప్రారంభించక పోతే ఆ తర్వాత వర్షాకాలం వస్తుందని అప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు.

## కులాంతర వివాహం చేసుకుందని డిప్యూటీ తహసీల్దార్ భర్త దారుణహత్య



**మండపేట, పతాకం న్యూస్:** ఎపి లోని అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. తమ చెల్లిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడనే కోపంతో ఇద్దరు సోదరులు ఓ యువకుడిని దారుణంగా హతమార్చారు. కులాంతర వివాహం చేసుకోవడమే ఈ దారుణానికి కారణమని తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారపూడి శివారు వేములపల్లిలో వస్త్ర వ్యాపారం చేసుకునే పీవీవీ సూర్యప్రకాశరావు(41), రాయవరంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అయినవిల్లి సంధ్య కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ హైస్కూలు స్నేహితులు కావడం విశేషం. సూర్యప్రకాశరావుది తమ కులం కాకపోవడంతో సంధ్య కుటుంబం వీరి ప్రేమను తిరస్కరించింది. అయినా సరే, ఒకటవ్వాలని నిశ్చయించుకున్న ఈ జంట అన్నవరంలో పెళ్లి చేసుకున్నారు. వివాహం తర్వాత సంధ్యను తీసుకుని సూర్యప్రకాశరావు వేములపల్లిలోని తన నివాసానికి వెళ్లారు. తమ చెల్లెలి పెళ్లి విషయం తెలిసి సూర్యప్రకాశరావుపై సంధ్య సోదరులు చంద్రపాల్, గిరిబాబు కక్ష పెంచుకున్నారు. అర్ధరాత్రి సమయంలో సూర్యప్రకాశరావు ఇంటిపై దాడి చేసిన నిందితులు.. అతడిని బయటకు లాగి బండరాయితో ముఖంపై చితకబాదారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సూర్యప్రకాశరావు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న స్థానికులు నిందితులను పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు.

## ఘనంగా సైన్స్ దినోత్సవం

**కోనసీమ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని శ్రీ సిద్ధార్థ పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం పాఠశాల డైరెక్టర్ కె.ముల్లారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఫిబ్రవరి 28న ఈ సైన్స్ దినోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది స్కిన్నోవా .26 పేరుతో ఈ సైన్స్ దినోత్సవం లో దయినందిన జీవితంలో విజ్ఞాన శాస్త్ర ప్రాధాన్యతను వివరించే విధంగా విద్యార్థులు వివిధ ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ఆనందించదగ్గ విషయం అన్నారు. విద్యార్థిని విద్యార్థుల్లో సఅజనాత్మక, తార్కిక మేధస్సును పెంపొందించే ఈ ప్రదర్శనలు నిర్వహించడం ఎంతో గర్వకారణం అన్నారు.

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా జస్టిస్ లీసా గిల్‌ను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారినిని మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సిఫార్సు చేసింది. ఈ మేరకు ఈ నెల 26న జరిగిన సమావేశంలో కొలీజియం ఈ నిర్ణయం తీసుకుంది. 'పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేయాలని, ఖాళీ ఏర్పడే తేదీ నుండి ఆ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆమెను నియమించాలని కొలీజియం నిర్ణయించింది' అని తీర్మానం పేర్కొంది. అయితే ప్రస్తుతం ఆమె ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయి, న్యాయమూర్తిగా వ్యవహరిస్తారు. దాదాపు రెండు నెలల తరువాత, ఏప్రిల్ 25న ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేసినప్పుడు, ఆమె ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరిస్తారు. జస్టిస్ లీసా గిల్ ముందస్తు బదిలీ కొలీజియం ప్రకటించిన కొత్త విధానానికి అనుగుణంగా ఉంది. కొత్త విధానం ప్రకారం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడానికి ప్రతిపాదించబడిన న్యాయమూర్తిని ఖాళీ ఏర్పడటానికి రెండు నెలల ముందు బదిలీ చేయొచ్చు. తద్వారా కొత్త ప్రధాన న్యాయమూర్తి అధికారికంగా బాధ్యతలు స్వీకరించే ముందు హైకోర్టు పనితీరు, పరిపాలనా వ్యవహారాలపై న్యాయమూర్తి సుపరిచితుడయ్యేలా చేయడమే దీని ఉద్దేశం. జస్టిస్ లీసా గిల్ పంజాబ్ విశ్వవిద్యాలయంలోని న్యాయ విభాగంలో పూర్వ విద్యార్థి, అక్కడి నుండి బిఎ ఎల్ఎల్‌బి (మూడు సంవత్సరాలు), ఎల్ఎల్ఎం పట్టా పొందారు. ఆమె 1990లో న్యాయవాదిగా చేరి పంజాబ్, హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. ఆమె క్రిమినల్, సివిల్, సర్వీస్, రెవెన్యూ, రాజ్యాంగ విషయాలతో సహా వివిధ రకాల కేసులను వాదించారు. అనేక సంవత్సరాలు చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి, అలాగే కొన్ని బోర్డులు, కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహించారు. 2014 మార్చి 31న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

## కల్వర్ట్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**కోనసీమ, పతాకం న్యూస్:** అభివృద్ధి పనులలో భాగంగా బీబీ లంక రహదారిలో కల్వర్ కల్వర్ట్ నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎంపీడీవో ఏ.రాజు గుత్తేదారులను హెచ్చరించారు. మండలంలోని బడుగువానిలంక వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్ట్ విస్తరణ కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.15 లక్షలతో నిర్మాణ పనులను శనివారం ఎంపీడీఓ ఎ.రాజు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. గ్రామ ప్రజల రాకపోకలకు అనుకూలంగా, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను నివారించే లక్ష్యంతో ఈ కల్వర్ట్ నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. పనులు నాణ్యతతో, నిర్దిష్ట అంచనాలకు అనుగుణంగా కొనసాగుతున్నాయా అనే విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నిర్మాణంలో వినియోగిస్తున్న సామగ్రి, పనుల పురోగతి, కార్మికుల హాజరు తదితర అంశాలను సమీక్షించారు.

# కీళ్ల సమస్యలతో బాధపడుతున్నారా?



కీళ్ల నొప్పులు ఉన్నవారు ఈ జీవనశైలి మార్పులు చేసుకుంటే నొప్పులను తగ్గించుకోవచ్చు..! మారిన జీవన విధానం కారణంగా 30 ఏళ్ల వయసులోనే చాలా మంది కీళ్ల సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సమస్య ఇప్పుడు సర్వసాధారణం అయ్యిందని చెప్పవచ్చు. ఎక్కువ సేపు కూర్చొని పని చేయడం వల్ల వెన్నునొప్పి, మెట్లు ఎక్కేటప్పుడు మోకాళ్ల నొప్పులు, ల్యాప్‌టాప్ లు ఉపయోగించడం వల్ల భుజాల నొప్పి వంటి సమస్యలతో బాధపడే యువత సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని చెప్పవచ్చు. మారిన జీవన విధానం కారణంగా 30 ఏళ్ల వయసులోనే చాలా మంది కీళ్ల సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సమస్య ఇప్పుడు సర్వసాధారణం అయ్యిందని చెప్పవచ్చు. ఎక్కువ సేపు కూర్చొని పని చేయడం వల్ల వెన్నునొప్పి, మెట్లు ఎక్కేటప్పుడు మోకాళ్ల నొప్పులు, ల్యాప్‌టాప్ లు ఉపయోగించడం వల్ల భుజాల నొప్పి వంటి సమస్యలతో బాధపడే యువత సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని చెప్పవచ్చు. అయితే చాలా మంది ఈ నొప్పులను తేలికగా తీసుకుంటూ ఉంటారు. కానీ 30 ఏళ్ల వయసులో వచ్చే ఈ నొప్పులను తేలికగా తీసుకోకూడదని, వీటిని విస్మరించకూడదని వైద్యులు చెబుతున్నారు. కొన్ని రకాల నొప్పులను జీవనశైలిలో మార్పుల ద్వారా తగ్గించుకోవచ్చు. అయితే కొన్ని రకాల నొప్పులకు మాత్రం తప్పకుండా చికిత్స తీసుకోవాలని లేదంటే అవి మరింత తీవ్రమయ్యి కీళ్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలుగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ నొప్పులకు ప్రధాన కారణం జీవనశైలినే అని కూడా వారు చెబుతున్నారు. ఆఫీస్ లో డెస్క్ ల వద్ద కూర్చోవడం, సెల్‌ఫోన్ స్క్రోల్ చేస్తూ కూర్చోవడం వల్ల ఈ నొప్పులు ఎక్కువగా వస్తున్నాయని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. శారీరక శ్రమ తగ్గడం, సరైన భంగిమలో కూర్చోకపోవడం వల్ల, ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల కండరాలు బలహీనపడతాయి. వెన్నెముక, తుంటి, మోకాళ్లు, భుజాలు వంటి కీళ్లపై ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. కూర్చునేటప్పుడు సరైన భంగిమలో కూర్చోకపోవడం వల్ల మెడ, వీపుపై కూడా ఒత్తిడి పడుతుంది. దీంతో కాలక్రమేణా కండరాలు బలహీనంగా తయారవ్వడంతోపాటు నొప్పికి కూడా దారి తీస్తుంది. కీళ్ల నొప్పులతో బాధపడే వారు జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల ఈ సమస్యల నుండి సులంగా బయటపడవచ్చు.

రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సరైన భంగిమలో కూర్చోవడం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, స్క్రీన్ సమయాన్ని తగ్గించడం, సాగదీసే వ్యాయామాలు చేయడం వల్ల నొప్పులు చాలా వరకు తగ్గుతాయి. అలాగే ఫిజియోథెరపీ, గైడెడ్ వర్కౌట్లు చేయడం వల్ల కండరాలు బలంగా తయారవుతాయి. కీళ్ల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇక జీవనశైలిలో మార్పులు చేసినప్పటికీ కీళ్ల నొప్పులు తగ్గకపోతే అది కీలు లోపల నిర్మాణ సమస్యలను సూచిస్తుంది. కీళ్ల నొప్పులతో పాటు కీళ్ల చుట్టూ వాపు, విశ్రాంతి సమయంలో కూడా నొప్పి ఉండడం, కీళ్లు కదిలించేటప్పుడు శబ్దాలు రావడం వంటి లక్షణాలను విస్మరించకూడదు. ఈ లక్షణాలు మృదులాస్థి దెబ్బతినడం, స్నాయువు ఒత్తిడి వంటి సమస్యలను సూచిస్తాయి. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం చాలా అవసరం. 30 ఏళ్ల వయసులో కీళ్ల నొప్పులు రావడం సాధారణమైన విషయం కాదని ఇవి మన జీవనశైలికి ఒక హెచ్చరిక సంకేతం వంటివి అని ఈ నొప్పులను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర నష్టాన్ని చూడాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# ఫ్రీహోల్డ్ భూములపై నిషేధం ఎత్తివేత?

## ఒకటి, రెండురోజుల్లో ప్రభుత్వ ఉత్తర్వులు



**విజయనగరం, పతాకం న్యూస్:** ఫ్రీహోల్డ్ భూముల విషయంలో కీలక అడుగు పడనుంది. వాటిపై ఉన్న నిషేధం తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది. అయితే నిజాయితీగా ఫ్రీహోల్డ్ భూమిలో ఉన్న వారు మాత్రమే విక్రయించేలా నిఘా పెట్టనుంది. గత ప్రభుత్వ హయాంలో డీపట్టా భూములకు సంబంధించి 20 ఏళ్లు గడువు దాటితే అమ్ముకోవచ్చని జీవో ఇచ్చారు. దీంతో వెనువెంటనే కోట్లాది రూపాయల భూములు చేతులు మారిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ వివాదాస్పద జీవోపై సమీక్షించింది. 20 సంవత్సరాలు పూర్తికానివి సైతం ఫ్రీహోల్డ్‌లో చూపి భారీగా అవకతవకలు జరిపినట్టు..పోరంబోకు భూములను కూడా వాటిలో చూపి విక్రయించినట్టు గుర్తించారు. దీంతో ఆ విక్రయాలపై నిషేధం విధించారు. కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటుచేశారు. సుమారు 19 నెలలుగా వీటిపై నిషేధం కొనసాగుతుండగా.. నిజమైన హక్కుదారులు తమ భూములను విక్రయించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటుండడాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్నీ సవ్యంగా ఉన్న భూములపై నిషేధం ఎత్తివేయనుంది. ఆంక్షలు సడలించనుంది. ఉత్తర్వుల జారీకి సన్నాహాలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఫ్రీహోల్డ్ భూముల విషయంలో ఒక జీవో జారీచేసింది. దాని ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 13.59 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. అందులో 5.74 లక్షల ఎకరాలను అక్రమంగా, చట్ట వ్యతిరేకంగా నిషేధిత జాబితా నుంచి బయటకు తీశారు. వాటిలో 55 వేల ఎకరాలకు పక్కాగా రిజిస్ట్రేషన్లు జరగ్గా.. 8483 ఎకరాల విషయంలో అక్రమాలు జరిగినట్టు అధికారులు తేల్చారు. దీంతో ఈ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. క్రయ విక్రయాలను నిషేధించింది. ఎన్నోసార్లు విచారణ గడువు పరిమితిని ప్రభుత్వం పెంచింది. ఎట్టకేలకు దీనిపై స్పష్టత రావడంతో చర్యలకు దిగనుంది. అప్పట్లో కీలకంగా వ్యవహరించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు నోటీసులు అందనున్నాయి. బాధ్యులైన అధికారులపై రెవెన్యూ శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించనుంది.

## 'పది' పరీక్షలను సజావుగా నిర్వహించాలి : కలెక్టర్




**గుంటూరు, పతాకం న్యూస్:** పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా పరీక్షా కేంద్రాలకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ అధికారులకు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులకు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో శిక్షణివ్వగా కలెక్టర్ మాట్లాడారు. వచ్చేనెల 16వ తేదీ నుంచి జరిగే పరీక్షలకు గుంటూరు జిల్లాలో 149 పరీక్ష కేంద్రాల్లో 26,699 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం స్ట్రాంగ్ రూముల నుంచి ఎస్కార్ట్స్ ద్వారా పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రం తీసుకురావడంతో పాటు నిర్ణీత సమయంలో ఇన్విజిలేటర్లకు సక్రమంగా పంపిణీ జరిగేలా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేలా కేంద్రాల్లో ఏర్పాట్లను ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. పరీక్షల సమయంలో వదంతులు వ్యాప్తి చెందకుండా పర్యవేక్షించాలన్నారు. ప్రతిరోజూ పరీక్ష ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సక్రమంగా ప్యాకింగ్ చేసిపూర్తి భద్రత మధ్య సకాలంలో పోస్ట్ ఆఫీస్‌కు అందించాలన్నారు. విద్యాశాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు నిర్లక్ష్యం లేకుండా శిక్షణలో తెలియజేసిన మార్గదర్శకాల కచ్చితంగా పాటించాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు నిర్వర్తించాల్సిన ప్రక్రియలపై రిసోర్స్ పర్సన్స్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణిచ్చారు. కార్యక్రమంలో ప్రాంతీయ సంచాలకులు లింగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి సలీంబాష, డైరెక్టర్ కామన్ బోర్డు తిరుమలేష్, ఎంఇఒలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దని ఆందోళన

**వినుకొండ, పతాకం న్యూస్:** పట్టణంలోని వెల్లటూరు రోడ్డు హనుమాన్ నగర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్ తొలగించాలని డిమాండ్ చేస్తూ మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. రెస్టారెంట్ ఎదురుగా ఎస్టీ రెసిడెన్షియల్ బాలుర హాస్టల్ ఉందని, నివాస గృహాల మధ్య బార్ ఏర్పాటు చేశారని, నిబంధనలకు విరుద్ధంగా పెట్టిన బార్ అండ్ రెస్టారెంట్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. వెల్లటూరు రోడ్‌లో పాఠశాల, దేవాలయం, హాస్టల్లో ఉన్నాయని, ప్రతిరోజూ మహిళలు, విద్యార్థినులు, పిల్లలు, సందర్శకులు రాకపోకలు సాగిస్తుంటారని, వీరు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని చెప్పారు. హనుమాన్ నగర్, ఓబయ్య కాలనీ ప్రజలకు మద్యం దుకాణం తీవ్ర ఇబ్బందన్నారు.




## చరిత్ర సృష్టించిన జమ్ముకశ్మీర్..

### తొలిసారి రంజీ ట్రోఫీ కైవసం



జమ్ము కశ్మీర్ చరిత్ర సృష్టించింది. తొలిసారి రంజీ ట్రోఫీ ఛాంపియన్‌గా అవతరించింది. హుబ్బళ్లి వేదికగా కర్ణాటకతో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. అయితే తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం దక్కడంతో జమ్ము కశ్మీర్ విజేతగా ఎంపికైంది. దీంతో కశ్మీర్ క్రికెట్ చరిత్రలో తొలిసారి రంజీ ట్రోఫీని ముద్దాడింది. కాగా, ఈ ప్రతిష్ఠాత్మక ఫైనల్‌ను చూసేందుకు కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా స్టేడియానికి వచ్చారు. తమ రాష్ట్ర ఆటగాళ్లను దగ్గరుండి ప్రోత్సహించారు. ఓవర్‌నైట్ స్కోర్ 186-4 వద్ద కశ్మీర్ రెండో ఇన్నింగ్స్‌ను ఐదో రోజూ కొనసాగించింది. అయితే 342-4 (113 ఓవర్లు) స్కోరు వద్ద కశ్మీర్ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. ఆ సమయానికి ఇంకో ఒక్క సెషన్ ఆట మాత్రమే మిగిలింది. అయితే ఒక్క సెషన్‌లో ఫలితం వచ్చే ఛాన్స్ లేనందున మ్యాచ్‌ను డ్రా గా ముగించేందుకు ఇరు జట్ల కెప్టెన్లు అంగీకరించారు. అలా తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించిన జమ్ముకశ్మీర్ టైటిల్‌ను దక్కించుకుంది. దీంతో 67 ఏళ్ల కశ్మీర్ నిరీక్షణకు ఫుల్‌స్టాప్ పడింది.

## నేడు వెస్టిండీస్‌తో టీమిండియా కీలక మ్యాచ్

### ఎవరూ ఓడితే వారు ఇంటిదారి..



టీ20 ప్రపంచ కప్ లో కీలక సమరానికి టీమిండియా సన్నద్ధం అవుతోంది. ప్రపంచ కప్ సెమీస్ లో చేరాలంటే క్వార్టర్ ఫైనల్ తరహా మ్యాచ్ లో భీకర ఫాంలో ఉన్న విండీస్ తో తల పడనుంది. ఈ మ్యాచ్ లో గెలిస్తే సెమీస్ ఆడేందుకు ముంబాయికి.. ఓడితే ఇంటికి అన్నట్లుగా పరిస్థితి మారింది. అయితే, అన్ని రంగాల్లోనూ విండీస్ పోటీ లేదన్నట్లుగా కనిపిస్తోంది. టీమిండియా సమిష్టిగా రాణిస్తేనే విజయం సాధ్యం. అయితే, ఇక్కడ పిచ్ కండీషన్లు.. టాస్.. తుది జట్టు తో పాటుగా సెంటిమెంట్ సైతం ఫలితం పై ప్రభావం చూపనుంది. వరల్డ్ కప్ సూపర్-8 ఆఖరి పోరులో ఆదివారం వెస్టిండీస్ తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో పరుగుల వరద ఖాయమని స్థానిక క్యూరేటర్ సుజన్ ముఖర్జీ వెల్లడించాడు.గత నెల తొమ్మిదిన ఈడెన్‌గార్డెన్స్‌లో స్కాట్లాండ్-ఇటలీ మధ్య నిర్వహించిన మ్యాచ్ పిచ్‌పైనే భారత్-వెస్టిండ?స పోరు జరగడం. ఆ పోటీలో స్కాట్లాండ్ తొలుత 200 పరుగులకుపైగా స్కోరు చేసింది. ఇక..బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ వికెట్‌ను పరిశీలించి చీఫ్ క్యూరేటర్ ఆశిష్ భౌమిక్‌తో కలిసి సుదీర్ఘంగా చర్చించాడు. వికెట్ ఉపరితలం బాగా పొడిగా ఉండనున్న క్రమంలో స్పిన్నర్లు కీలక భూమిక పోషించే చాన్సుంది. పిచ్‌పై బౌన్స్ కూడా అయ్యే అవకాశాలు లేకపోలేదు. ఇటలీతో ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ పేసర్ ఆర్చర్ వికెట్ నుంచి అందిన బౌన్స్‌ను చక్కగా ఉపయోగించుకున్నాడు. దాంతో టీమిండియా పేస్ దళపతి బుమ్రా, ఎడమ చేతి వాటం బౌలర్ అర్ష్‌దీప్, హార్దిక్ బౌన్స్‌తో లబ్ధి పొందే అవకాశాలున్నాయి. మరోవైపు వెస్టిండీస్ ఇక్కడ రెండు గ్రూపు మ్యాచ్‌లు ఆడి ఉండడం ఆ జట్టుకు సానుకూలాంశం. స్కాట్లాండ్, ఇటలీలతో జరిగిన ఆ రెండు మ్యాచ్‌ల్లో కరీబియన్లు విజయం సాధించారు. ఈ మ్యాచ్ కోసం తుది జట్టులో ఎలాంటి మార్పులు ఉండే అవకాశం లేదు. జింబాబ్వే తో ఆడిన జట్టునే బరి లోకి దించటం ఖాయంగా కనిపిస్తోంది. టాస్ కీలకం కానుంది. ఇక్కడ విండీస్ ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. విండీస్ బ్యాటర్లను నియంత్రించ కలిగితే.. విజయం పైన భారత్ కు మరింత ఆశలు పెరుగుతాయి. టీమిండియా టాప్ ఆర్డర్ బ్యాటర్లు జింబాబ్వే తో ఆడిన రీతిన ఆడగిలిగితే గెలుపు అవకాశాలు ఉంటాయి. గత రికార్డులు చూస్తే భారత్, ఇంగ్లాండ్ మధ్య సెమీఫైనల్ పోరు ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటుంది. 2022 టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్లో ఇంగ్లాండ్ చేతిలో ఎదురైన ఘోర పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవడానికి ఈసారి టీమిండియాకు మంచి అవకాశం దక్క నుంది. ఈడెన్ గార్డెన్స్‌లో విండీస్‌ను చిత్తు చేసి, మార్చి 5న వాంఖడేలో ఇంగ్లాండ్‌తో అమీతుమీ తేల్చుకోవడానికి భారత్ సిద్ధంగా ఉంది.





# 'ది కేరళ స్టోరీ 2'పై స్టే ఎత్తివేత..విడుదలకు మార్గం సుగమం..



'ది కేరళ స్టోరీ 2' సినిమా విడుదల కాకుండా కేరళ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను డివిజన్ బెంచ్ ఎత్తివేసింది. దీంతో ఈ చిత్రం విడుదలకు మార్గం సుగమమైంది. ఈ చిత్రం విడుదల కాకుండా హైకోర్టు సింగిల్ బెంచ్ ఇటీవల స్టే ఇచ్చింది. సీబీఎఫ్‌సీ తీరును తప్పుబడుతూ సినిమాను పునఃపరిశీలించాల్సిందిగా ఆదేశించింది. 15 రోజుల పాటు సినిమాపై స్టే విధించింది. సింగిల్ బెంచ్ తీర్పును చిత్ర నిర్మాత కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. ఈ రోజు సాయంత్రం వరకు ఇరు వర్గాల తరఫున సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ వీ వీ బాలకృష్ణన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసింది.

2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్ 'ది కేరళ స్టోరీ 2' రూపొందింది. దీనికి కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా, విపుల్ అమృత్ లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్త, అదితి బాటియా, ఐశ్వర్య ఓజా ఈ చిత్రంలో నటించారు. నిజ జీవితంలో జరిగిన అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చెబుతున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 27న విడుదల చేస్తామని చిత్ర బందం ప్రకటించగా, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుతో వాయిదా పడింది. ఈరోజు డివిజన్ బెంచ్ తీర్పుతో ఈ సినిమా విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి.

# 2న 'పెద్ది' సెకండ్ సింగిల్..



రామ్ చరణ్, బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా సినిమా 'పెద్ది'. ఈ చిత్రానికి సంబంధించి క్రేజీ అప్‌డేట్ ఒకటి బయటికి వచ్చింది. ఈ చిత్రం నుండి సెకండ్ సింగిల్ 'రై రై రారా'ని మార్చి 2న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. సుమారు 1000 మంది డ్యాన్సర్లతో అత్యంత భారీ స్థాయిలో ఈ ఇంట్రడక్షన్ సాంగ్‌ని చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ఆస్కార్ విజేత ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో కన్నడ నటుడు శివరాజ్ కుమార్, జగపతి బాబు, బోమన్ ఇరానీ, దివ్యేందు శర్మ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

SJS ABROAD MEDICAL ACADEMY
FOR MBBS ABROAD
Extensive Support for Future Medical Students Start Your Medical Career Today
For Students Aiming To Study Medicine Abroad Enroll Now For Upcoming Intakes
PH: +91 9112311114
. Customized Career Programs
. Visa Application Expertise
. Placement in Top Universities
. Guidance on Scholarships
. Assistance with Accommodation
. Pre-Departure Briefing
Intakes Open Now
TERMS & CONDITIONS APPLY*

# కోలీవుడ్ సినిమాలో వైష్ణవి చైతన్య



ఖీుఎవఎశీశీనిజుఋఖఅశ్రీజౌష్టఘ్‌రాాజూజూశువశ్రీవస్త్రతీఖుఎ

టాలీవుడ్ నటి వైష్ణవి చైతన్య త్వరలో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు. యూట్యూబ్ దగ్గర మొదలైన ఆమె ప్రయాణం ఇప్పుడు సినిమా వరకు చేరింది. అల వైకుంఠపురములో, రంగ్‌దే, టక్ జగదీష్ వంటి సినిమాల్లో చిన్న పాత్రలు చేశారు. ఆనంద్ దేవరకొండ 'బేబీ' సినిమాతో కథానాయికగా మారారు. ఆ సినిమా బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకోవటంతో మంచి గుర్తింపుతోపాటుగా అవార్డులనూ అందుకున్నారు. ప్రస్తుతం ఎపిక్ : ద సెమిస్టర్ మూవీ చేస్తున్నారు. తాజాగా కోలీవుడ్‌లో ఓ సినిమాలో నటించేందుకు ఆమెకు ఛాన్స్ వచ్చినట్లుగా సమాచారం. జీవీ ప్రకాష్ కథానాయకుడిగా విఘ్నేష్ కార్తీక్ ఓ సినిమాకు ప్లాన్ చేశారు. వైష్ణవి చైతన్య కథానాయికగా ఎంపికచేశారని చర్చ జరుగుతోంది. అజిత్ హీరోగా నటించిన వాలిమై అనే తమిళ మూవీలో వైష్ణవి చైతన్య చిన్న పాత్ర పోషించారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**